క్లుప్తంగా

రూ.2.50 లక్షల ఎల్‌వోసీ



ఎల్‌వోసీ అందిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

సుల్తానాబాద్‌ రూరల్‌: సుల్తానాబాద్‌ మండలంలోని గొల్లపల్లికి చెందిన శ్రీలతకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.2.50 లక్షల ఎల్‌వోసీని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఆదివారం అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలాజీ రావు, సర్పంచ్‌ రమేశ్‌, గర్రెపల్లి సింగిల్‌విండో చైర్మన్‌ జూపల్లి సందీప్‌రావు, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌ బిల్లులు ఏఈ ఆఫీస్‌లోనే తీసుకోవాలి

రామగుండం: పట్టణంలోని అంబేడ్కర్‌ కూడలిలో గల ఎన్‌పీడీసీఎల్‌ ఏఈ కార్యాలయంలో గతంలో విద్యుత్‌ బిల్లుల వసూలు కేంద్రం ఉండేది. నెల రోజుల క్రితం దాన్ని ఈఆర్‌వో కార్యాలయానికి మార్చడంతో దూరం పెరిగి, వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి, ఏఈ కార్యాలయంలోనే బిల్లులు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆదివరాహస్వామి ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

కమాన్‌పూర్‌: మండల కేంద్రంలోని శ్రీఆదివరాహస్వామిని దర్శించుకునేందుకు ఆదివారం రాష్ట్రంలోని ఆయా ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారికి పూజలు చేసి, మొక్కు చెల్లించుకున్నారు.

‘మత్స్యకార్మికులకు అండగా ఉంటా’

పెద్దపల్లిరూరల్‌: జిల్లాలో చేపల వేటపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ముదిరాజ్‌ కుటుంబాలకు అండగా ఉంటానని మత్స్యపారిశ్రామిక సంఘం జిల్లా చైర్మన్‌ కొలిపాక నర్సయ్య అన్నారు. పెద్దపల్లి శివారు చందపల్లిలోని పెద్దమ్మతల్లి ఆలయ ఆవరణలో ముదిరాజ్‌ కులస్తులు ఆదివారం ఆయనను సత్కరించారు. మత్స్యకారుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించేందుకు తనవంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూస్తానన్నారు. ముదిరాజ్‌ నాయకులు పాల్గొన్నారు.

సిమెంట్‌ బెంచీల ఏర్పాటు



పాలకుర్తి: మండలంలోని 10 గ్రామాల్లో బీజేపీ మండల అధ్యక్షుడు పత్తి సంజీవ్‌ ఆధ్వర్యంలో ఆదివారం సిమెంట్‌ బెంచీలు ఏర్పాటు చేశారు. పార్టీ నేత, ఆర్టీసీ మాజీ చైర్మన్‌ సోమారపు సత్యనారాయణ జన్మదినాన్ని పురస్కరించుకొని రూ.35 వేల విలువ గల 12 బెంచీలను ఆయా గ్రామాల ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మాదాసు రాజేశం, పోతుగంటి బ్రహ్మం, గుర్రం సతీశ్‌, ఉదయ్‌, అజయ్‌, గంగుల సతీశ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉప కాల్వ నిర్మాణానికి రూ.25.11 కోట్లు

ధర్మారం: మండలంలోని బొమ్మారెడ్డిపల్లి శ్రీరాంసాగర్‌ ప్రాజెక్టు డీ–83బీ ఉప కాల్వ నిర్మాణానికి ప్రభుత్వం రూ.25.11 కోట్లు మంజూరు చేసింది. ఏడాది క్రితం నిధులు మంజూరు చేయగా భూసేకరణలో జాప్యం జరిగింది. ఈ క్రమంలో అంచనాలు పెరిగాయి. దీంతో పనులు ముందుకు సాగలేదు. అయితే రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ ఆదేశాల మేరకు ఇంజినీరింగ్‌ అధికారులు రీఎస్టిమేషన్‌ వేసి, ప్రభుత్వానికి పంపించగా నిధులు మంజూరైనట్లు మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి తెలిపారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి



గోదావరిఖని: నిత్యావసరాల ధరలు తగ్గించాలని డిమాండ్‌ చేస్తూ టీడీపీ ఆధ్వర్యంలో ఆదివారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో నిరసన తెలిపారు. గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డి స్వరాజ్యం, మాటేటి లక్ష్మి, రాకుమారి, చిలుముల లక్ష్మి, భారతి, కోటగిరి పాపయ్య, అనుమ రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

వృత్తి నడవక.. పూట గడవక

- సైకిల్‌పై నవారు విక్రయం, ఇతర వ్యాపారాల్లో చేనేత కార్మికులు
- నేత కార్మిక పింఛన్‌ తప్ప అందని ఇతర పథకాలు
- రూ.లక్ష సాయం, మోపెడ్లు ఇవ్వాలని వేడుకోలు
- పెద్దపల్లి నియోజకవర్గంలో దాదాపు 1,000 కుటుంబాలు



సైకిల్‌పై నవారు విక్రయిస్తున్న తెలుకుంట నేత కార్మికుడు బూర్ల లక్ష్మయ్య

జూలపల్లి: తాతల కాలం నుంచి వారసత్వంగా వస్తున్న కుల వృత్తి నడవక, పూట గడవక బతుకు దెరువు కోసం ఇతర రంగాలపై ఆధారపడుతున్నారు.. అక్కడా తగిన రాబడి లేక దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారు నేత కార్మికులు. ప్రభుత్వం ఇతర సామాజిక వర్గాలకు ఇచ్చినట్లు నేత కార్మికులకు చేయూతనివ్వక పోవడంతో చిన్న చిన్న పనులు చేస్తూ జీవితాలను నెట్టుకొస్తున్నారు. నేత వృత్తికి ఆదరణ కరువై, ఉపాధి అవకాశాలు సన్నగిల్లడంతో సైకిల్‌ తొక్కుతూ గ్రామాల్లో ఇల్లిల్లూ తిరిగి పలు రకాల వ్యాపారాలు చేస్తున్నారు.

మూతపడిన చేనేత సహకార సంఘాలు

పెద్దపల్లి నియోజకవర్గంలో పద్మశాలీ కుటుంబాలు దాదాపు 1,000 వరకు ఉన్నట్లు అంచనా. వీటిలో కొన్ని నేత పని చేస్తుండగా, మిగతా కుటుంబాలు తమకు తోచిన వ్యాపారం చేసుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి నేత కార్మిక పింఛన్‌ తప్ప ఇతర పథకాలు అమలు కావడం లేదు. ఇదివరకు ఉన్న చేనేత సహకార సంఘాలు అవాంతరాలతో మూతపడగా ప్రస్తుతం నియోజకవర్గంలో ఒక్క సంఘమే సుల్తానాబాద్‌ మండలంలోని కనుకుల గ్రామంలో నడుస్తోంది. సర్కారు ఇతర సామాజిక వర్గాల మాదిరిగానే తమకూ సాయం చేయాలని నేత కార్మికులు కోరుతున్నారు.

రూ.లక్ష సాయం ఇవ్వకపోవడంపై నిరాశ

కుల వృత్తులవారికి రూ.లక్ష సాయం చేస్తామని, దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. దీంతో నేత కార్మికులు సంబరపడ్డారు. తీరా పద్మశాలీలకు ఇందులో చోటు లేకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందించడం, ధర్నాలు చేపట్టం వంటివి చేశారు. అయినా ప్రభుత్వం నుంచి స్పందన కరువైంది.

జూలపల్లి మండలంలో 450 కుటుంబాలు

జూలపల్లి మండలంలో 450 పద్మశాలీ కుటుంబాలు ఉన్నాయి. వీటిలో దాదాపు 100 కుటుంబాలు చేనేత వృత్తిపై, మరో 100 కుటుంబాలు నేతకు సంబంధించిన వ్యాపారాలపై ఆధారపడగా, మిగతావి ఇతర వ్యాపారాలు చేసుకుంటున్నారు. తెలుకుంటలో 35 కుటుంబాలు ఉండగా చాలామంది కులవృత్తిపై ఆధారపడినవారే. వీరు దుస్తులు, నవారును సైకిళ్లపై పెట్టుకొని, గ్రామాల్లో విక్రయిస్తూ పొట్టపోసుకుంటున్నారు. తమకు సర్కారు రూ.లక్ష సాయం చేస్తే అంతోఇంతో బతుకులు బాగుపడతాయని అంటున్నారు. సైకిల్‌పై వ్యాపారం చేసేవారికి ఇతర వర్గాలకు ఇచ్చినట్లు మోపెడ్లు ఇచ్చి, ఆదుకోవాలని కోరుతున్నారు.

మెకానిక్‌ పని చేస్తున్న



నేను చదువుకున్న. కుటుంబ పరిస్థితి బాగా లేకపోవడంతో ఉద్యోగం కోసం చూడకుండా మెకానిక్‌ పని చేస్తున్న. పద్మశాలీ కుటుంబాలకు చెందిన నిరుద్యోగులకు రూ.లక్ష సాయం అందించాలి.

– చిప్ప శ్రీకాంత్‌, నేత కార్మికుడు, మెకానిక్‌, తెలుకుంట

పద్మశాలీలను ఆదుకోవాలి



కుల వృత్తినే నమ్ముకున్న పద్మశాలీ కుటుంబాలను రూ.లక్ష సాయం పథకంలో చేర్చాలి. వ్యాపారాలు చేసుకునేవారికి ఉచితంగా మోపెడ్లు ఇవ్వాలి. రాజకీయంగా అన్ని పార్టీలు సముచిత స్థానం కల్పించాలి.

– సాయిరి మహేందర్‌, పద్మశాలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

పోచమ్మ బోనాలు.. ఎల్లమ్మ పట్నాలు



ఎల్కలపల్లి గేట్‌లో మొక్కు చెల్లిస్తున్న భక్తులు



ధర్మారం: గొర్రెను గావుపడుతున్న బైండ్ల పూజారి

రామగుండం: ఆషాఢమాసం చివరి ఆదివారం కావడంతో రామగుండం పట్టణంలోని నల్ల పోచమ్మ తల్లికి మహిళలు బోనాలు సమర్పించారు. జెన్‌కో ఉద్యోగులు ఆలయ ప్రాంగణంలో క్యూలైన్లు ఇతర ఏర్పాట్లు చేశారు. స్థానిక కార్పొరేటర్‌ కౌశిక లత బోనమెత్తుకొని కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారి ఆలయానికి వచ్చి, మొక్కు చెల్లించుకున్నారు.

ధర్మారం: మండల కేంద్రంలో ఆదివారం పోచమ్మ ఎలనంపుడు కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. బైండ్ల పూజారులు అమ్మవారి ఆలయం ఎదుట పట్నం వేసి, పూజలు చేశారు. గ్రామ పొలిమేరలో కట్టిన గ్రామ నిర్బంధం ముడుపుల వద్దకు వెళ్లి, వాటిని విప్పారు. బస్టాండ్‌ ఎదుట బైండ్ల పూజారులు గొర్రె పిల్లను గావుపట్టారు. అనంతరం ఆలయం వరకు భక్తులు ఊరేగింపుగా వెళ్లారు. సర్పంచ్‌ పుస్కూరి జితేందర్‌రావు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఫెర్టిలైజర్‌సిటీ: పాలకుర్తి మండలంలోని ఎఫ్‌సీఐ ఎల్కలపల్లి గేట్‌ గ్రామ పంచాయతీ పరిధిలో ఆదివారం రజక సంఘం ఆధ్వర్యంలో మడేళేశ్వర స్వామి, పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో వెళ్లి, మొక్కు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు మల్లయ్య, నాయకులు పాల్గొన్నారు.

జూలపల్లి: మండలంలోని తెలుకుంటలో గీత కార్మిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి పట్నాలు, బోనాలు ఘనంగా నిర్వహించారు. బీజేపీ నాయకుడు ఎగోళపు సదయ్య గౌడ్‌ మొక్కులు చెల్లించారు. గీతకార్మిక సంఘం అధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్‌, నాయకులున్నారు.

మడేలయ్య, కట్ట మైసమ్మకు మొక్కులు



మంథని: మున్సిపల్‌ పరిధిలోని రజకులందరూ స్థానిక బొక్కలవాగులో మడేలయ్య, కట్ట మైసమ్మకు ఆదివారం మొక్కులు చెల్లించుకున్నారు. బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా వెళ్లి, ప్రత్యేక పూజలు చేశారు. రజక సంఘం నాయకులు పోతరాజు సమ్మయ్య, శ్రీనివాస్‌, కొల్లూరి రాజయ్య, సమ్మయ్య, రమేశ్‌ తదితరులున్నారు.

రేవంత్‌ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

పెద్దపల్లిరూరల్‌: రైతుల సంక్షేమానికి కాంగ్రెస్‌ పార్టీ కట్టుబడి ఉందని, మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్సార్‌ హయాంలోనే ఉచిత విద్యుత్‌ అమలైందని పార్టీ పెద్దపల్లి మండల అధ్యక్షుడు కడార్ల శ్రీనివాస్‌ అన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే వ్యవసాయానికి నిరంతర ఉచిత విద్యుత్‌ అందిస్తామని ప్రకటించిన టీపీసీసీ చీఫ్‌ రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. ఆయన వ్యాఖ్యలను వక్రీకరించి, బీఆర్‌ఎస్‌ నాయకులు లబ్ధి పొందాలని చూడటం సరికాదన్నారు. నాయకులు ఆరె సంతోష్‌, అరగొండ రాజ్‌కుమార్‌, అనిల్‌, తాడూరి శ్రీమాన్‌, జడల రాజు, తిరుమలేశ్‌ తదితరులున్నారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి హాని.. వాడొద్దు



బట్ట సంచులు అందిస్తున్న నాయకులు

జూలపల్లి: ప్లాస్టిక్‌ పర్యావరణానికి హాని అని, ఎట్టిపరిస్థితుల్లోనూ వాడొద్దని కేసీఆర్‌ సేవాదళం గ్రామ శాఖ అధ్యక్షుడు దీకొండ రవి అన్నారు. ప్లాస్టిక్‌ను నివారించాలన్న ఉద్దేశంతో సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొద్దుల లక్ష్మణ్‌ పంపిన బట్ట సంచులను జూలపల్లి మండలంలోని కాచాపూర్‌లో మహిళలకు ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ నాయకులు మల్లయ్య, ఆంజయ్యగౌడ్‌, శివకుమార్‌, సాగర్‌ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ

పెద్దాపూర్‌లో మహాత్మా జ్యోతిబా పూలే యువజన సంఘం సభ్యులకు కేసీఆర్‌ సేవాదళం జిల్లా అధ్యక్షుడు దండె వెంకటేశం, నాయకుడు శాతల్ల కాంతయ్య ఆదివారం వాలీబాల్‌ క్రీడా సామగ్రి అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు, పద్మశాలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొద్దుల లక్ష్మణ్‌ వీటిని పంపించారని తెలిపారు. బీఆర్‌ఎస్‌ నాయకుడు పల్లె గంగయ్య, బీజేపీ నాయకుడు తీగల అశోక్‌ గౌడ్‌, సింగిల్‌విండో డైరెక్టర్‌ తొగరు శ్రీనివాస్‌ తదితరులున్నారు.

పేద విద్యార్థికి పోటీ పరీక్షల పుస్తకాలు..

జూలపల్లి మండల కేంద్రంలో చేనేత కుటుంబానికి చెందిన పేద విద్యార్థి దేవసాని వెంకటేశ్‌ పోటీ పరీక్షల పుస్తకాల కోసం ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకున్న జెడ్పీటీసీ సభ్యుడు బొద్దుల లక్ష్మణ్‌ వాటిని పంపించారు. స్థానిక రాజయోగి ఆశ్రమ నిర్వాహకుడు కన్నం సత్యనారాయణ ఆదివారం వెంకటేశ్‌కు అందించారు. పద్మశాలీ యువజన సంఘం మండల అధ్యక్షుడు మేరుగు రమేశ్‌, నాయకులున్నారు.

ప్యాసింజర్‌ రైళ్ల హాల్టింగ్‌ పునరుద్ధరించాలి



ప్రయాణికులు లేక బోసిపోయిన రైల్వేస్టేషన్‌

రామగుండం: పెద్దంపేట, రాఘవాపూర్‌, కొత్తపల్లి రైల్వేస్టేషన్లు కోవిడ్‌–19కు ముందు ప్రయాణికులతో కళకళలాడేవి. ప్రస్తుతం ప్యాసింజర్‌ రైళ్లను పూర్తి స్థాయిలో పునరుద్ధరించకపోవడంతో ప్లాట్‌ఫామ్స్‌ ప్రయాణికులు లేక బోసిపోతున్నాయి. కరోనాకు ముందు ఆయా రైల్వేస్టేషన్లలో భాగ్యనగర్‌, అజ్నీ ప్యాసింజర్‌, రామగిరి, సింగరేణి, పుష్‌పుల్‌ ప్యాసింజర్‌ రైళ్లు ఇరువైపులా రాకపోకలు సాగించేవి. జనతా కర్ఫ్యూ మార్చి 2021లో ప్రారంభమైన తర్వాత ప్యాసింజర్‌ రైళ్ల హాల్టింగ్స్‌ ఎత్తివేశారు. ఏడాది క్రితం ఒక్క సికింద్రాబాద్‌–కాగజ్‌నగర్‌ వెళ్లే భాగ్యనగర్‌ రైలుకు మాత్రమే హాల్టింగ్‌ కల్పించినప్పటికీ 10 మంది ప్రయాణికులకు మించకపోవడం గమనార్హం. కాగజ్‌నగర్‌ వైపు వెళ్లే క్రమంలో ఆలస్యంగా నడుస్తుండటంతో ఆసక్తి చూపించడం లేదన్న విమర్శలున్నాయి. ఇటీవలి కాలంలో కాజీపేట ప్రాంతంలో ఇంటర్‌ లాకింగ్‌, ట్రాక్‌ పునరుద్ధరణ పనుల నేపథ్యంలో రైల్వేశాఖ కాజీపేట–కాగజ్‌నగర్‌ సెక్షన్‌లో ప్యాసింజర్‌ రైళ్లను రద్దు చేసింది. ఈ నిర్ణయంపై ప్రయాణికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా ప్యాసింజర్‌ రైళ్లకు రైల్వేస్టేషన్లలో కోవిడ్‌–19కు ముందు ఉన్న హాల్టింగ్స్‌ను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

సుల్తానాబాద్‌ రూరల్‌: సుల్తానాబాద్‌ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2009–2010 బ్యాచ్‌ పదోతరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి వారు చదువుకున్న పాఠశాలే వేదికైంది. 13 ఏళ్లకు చిన్ననాటి స్నేహితులను కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధుల్లేవు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. కుటుంబాల క్షేమ సమాచారం తెలుసుకున్నారు. తరగతి గదిలో చేసిన అల్లరి, చిలిపి చేష్టలను గుర్తు చేసుకొని, సంతోషం వ్యక్తం చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. అనంతరం అందరూ కలిసి భోజనం చేశారు. రోజంతా ఆటపాటలతో సందడి సందడిగా గడిపారు. కార్యక్రమంలో రిటైర్డ్‌ ఉపాధ్యాయులు రంగారావు, శ్రీనివాస్‌, రాజమల్లు, ఉమారాణి, లక్ష్మణ్‌ పాల్గొన్నారు.

చెవిలో పూలతో జీపీ కార్మికుల నిరసన



పెద్దపల్లిలో నిరసన తెలుపుతున్న కార్మికులు



కాల్వశ్రీరాంపూర్‌లో భిక్షాటన చేస్తున్న కార్మికులు



రామగిరిలో సంఘీభావం తెలుపుతున్న వెంకన్న

పెద్దపల్లిరూరల్‌: గ్రామపంచాయతీ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలంటూ చేపట్టిన సమ్మె ఆదివారం 11వ రోజుకు చేరింది. రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ పెద్దపల్లిలో చెవిలో పూలు పెట్టుకొని, నిరసన తెలిపారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాల్సిన సర్కారు ప్రైవేట్‌ కార్మికులతో పనులు చేయించి, సమ్మెను నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతోందని కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాజా ఆరోపించారు. ప్రైవేటు కార్మికులతో పనులు చేయిస్తే ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. నాయకులు సత్యనారాయణ, రాజయ్య, రాజమొగిలి తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చాలి

జూలపల్లి: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలంటూ జీపీ కార్మికులు ఆదివారం జూలపల్లి ఎంపీడీవో కార్యాలయం ఎదుట చెవిలో పూల పెట్టుకొని, నిరసన తెలిపారు. కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు ఆసంపెల్లి బాణయ్య, నాయకులున్నారు.

సీపీఐ(ఎంఎల్‌) న్యూడెమోక్రసీ సంఘీభావం

రామగుండం: అంతర్గాంలో జీపీ కార్మికుల రిలే దీక్షలకు ఆదివారం సీపీఐ(ఎంఎల్‌) న్యూడెమోక్రసీ సంఘీభావం ప్రకటించింది. పెద్దంపేటలోని భగత్‌సింగ్‌ భవన్‌లో నూతన కమిటీ ఏర్పాటు సమావేశంలో తీర్మానించారు. పెద్దపల్లి డివిజన్‌ కార్యదర్శి ఈ.నరేష్‌, మండల కార్యదర్శి మల్లేశ్‌ నాయకులున్నారు.

భిక్షాటన

కాల్వశ్రీరాంపూర్‌: ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ జీపీ కార్మికులు ఆదివారం కాల్వశ్రీరాంపూర్‌లో భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. కనీస వేతన చట్టం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, అర్హులైన వారికి పదోన్నతి ఇవ్వాలని, విధి నిర్వహణలో అనారోగ్యానికి గురైతే వైద్యం అందించాలని, డబుల్‌ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని కార్మిక సంఘం మండల శాఖ అధ్యక్షుడు కలవేన గట్టయ్య డిమాండ్‌ చేశారు. నాయకులు రాజాబాబు, గౌసుద్దీన్‌, సంపత్‌, ఓదెమ్మ, రాములు, స్వామి తదితరులున్నారు.

కమాన్‌పూర్‌: పంచాయతీ కార్మికులు ఆదివారం అడవి శ్రీరాంపూర్‌ రోడ్డు నుంచి ముత్తారం తహసీల్దార్‌ కార్యాలయం వరకు డప్పుచప్పుళ్ల మధ్య భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. గత 11 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రభాకర్‌, శంకర్‌, సత్యనారాయణ, మల్లికార్జున్‌ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న డిమాండ్‌ చేశారు. రామగిరి ఎంపీడీవో కార్యాలయం ఎదుట కార్మికుల దీక్షా శిబిరాన్ని ఆదివారం సందర్శించి, సంఘీభావం తెలిపారు.

‘మా శ్రమకు ఫలితమేది?’

ఓదెల: తమ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని పంచాయతీ కార్మికులు ఆరోపించారు. ఓదెలలో ఆదివారం నిరసన తెలిపారు. కరోన సమయంలో ప్రాణాలకు తెగించి పని చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్మికులు నాగయ్య, బ్రహ్మచారి, మల్లేశం, రమేశ్‌, దిలీప్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునఃనిర్మాణ పనులకు సహకరించాలి

సుల్తానాబాద్‌: పట్టణంలోని పుసాలలో గల పురాతన శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయ పునఃనిర్మాణ పనులకు దాతలు సహకరించాలని ఆలయ కమిటీ చైర్మన్‌ కోట రంగారెడ్డి కోరారు. కొంతమంది సహకారంతో ప్రహరీ పూర్తికావస్తోందని తెలిపారు. మిగతా పనులను దాతలు ముందుకు వచ్చి, పూర్తి చేయించాలని విజ్ఞప్తి చేశారు.

శివాలయంలో రుద్రాభిషేకం

సుల్తానాబాద్‌: పట్టణంలోని శివాలయంలో మాస శివరాత్రి సందర్భంగా స్వామివారికి భక్తులు ఆదివారం రుద్రాభిషేకం, అన్నపూజ నిర్వహించారు. ఆషాఢమాసం చివరి ఆదివారం కావడంతో పూజలు చేశారు. పూజారులు తీర్థప్రసాదాలు అందజేశారు. పల్లా అశోక్‌ కుటుంబసభ్యులు, ఆలయ కమిటీ చైర్మన్‌ అల్లంకి సత్యనారాయణ తదితరులున్నారు.

ఫ్లైఓవర్‌ నిర్మించాలి



గోదావరిఖని: జీడీకే–2ఏ మోరీపై ఫ్లైఓవర్‌ నిర్మించాలని డిమాండ్‌ చేస్తూ బీఎస్పీ నాయకులు ఆదివారం నిరసన తెలిపారు. వానాకాలం వస్తే ఈ దారిలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గోలివాడ ప్రసన్నకుమార్‌, నాయకులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించుకోవాలి



మొక్క నాటుతున్న విండో డైరెక్టర్‌ రాజమల్లు

సుల్తానాబాద్‌: మొక్కలు నాటి సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఇంటి యజమానికి ఉందని సుల్తానాబాద్‌ సింగల్‌విండో డైరెక్టర్‌ గాజుల రాజమల్లు అన్నారు. ఆదివారం రెండో వార్డులో హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం హరితహారాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, అందరూ సహకరించి, విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌ గాజుల లక్ష్మి, ఫీల్డ్‌ అసిస్టెంట్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

రూ.700 కోట్లు విడుదల చేయాలి



మాట్లాడుతున్న కృష్ణ

గోదావరిఖని: సీఎం కేసీఆర్‌ మంచిర్యాల సభలో ప్రకటించిన రూ.700 కోట్లు వెంటనే విడుదల చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ.కృష్ణ డిమాండ్‌ చేశారు. ఆదివారం గోదావరిఖనిలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన ఆర్జీ–1 డివిజన్‌ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి సాధించిన లాభాలు రూ.2,184 కోట్ల నుంచి కార్మికుల వాటా రూ. 700 కోట్లు సీఎం ప్రకటించారన్నారు. 11వ వేతన ఒప్పందానికి సంబంధించి 23 నెలల ఏరియర్స్‌ చెల్లించాలన్నారు. నాయకులు కొమురయ్య, బాబు, శేఖర్‌, మొండయ్య, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

నేత్రదాత కుటుంబానికి అభినందన పత్రం



అభినందన పత్రం అందిస్తున్న శ్రీనివాస్‌

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్‌ యైటింక్లయిన్‌కాలనీకి చెందిన కుడిది లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. కుటుంబసభ్యులు ఆమె నేత్రాలను సదాశయ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో దానం చేశారు. ఆదివారం ఫౌండేషన్‌ నిర్వహించిన నేత్రదాత సంస్మరణ సభలో లక్ష్మి కుటుంబసభ్యులకు ఆర్జీ–2 ఎస్‌ఎంఎస్‌ ప్లాంట్‌ ఇన్‌చార్జి రమేశ్‌, టీబీజీకేఎస్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ ఐలి శ్రీనివాస్‌ తదితరుల చేతులమీదుగా అభినందన పత్రాన్ని అందజేశారు.

పరామర్శ

పెద్దపల్లిరూరల్‌: పెద్దపల్లి మండలంలోని హనుమంతునిపేటకు చెందిన బీజేపీ నాయకుడు గుర్రాల రాజేశం తండ్రి రాజయ్య మృతిచెందగా బాధిత కుటుంబసభ్యులను మాజీ ఎమ్మె ల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి ఆదివారం పరామర్శించారు. నాయకులు పర్స సమ్మయ్య, చిలువేరు ఓదెలు, ఠాగూర్‌ రాంసింగ్‌, కాసర్ల జనార్దన్‌ రెడ్డి, పిన్నింటి రాజు, పల్లె సదానందం, ఫహీం ఉన్నారు.